సంపుటి :02 సంచిక :242 పేజీలు :06 వెల ₹5

# అక్షర దర్బార్

www.aksharadarbar.com Voice of the people

శుక్రవారం 28, నవంబర్ 2025

వారసత్వ భూ బదిలీకి

## లంచం డిమాండ్

- రైతును రూ.15 వేలు అడిగిన తహసీల్దారు
- నగదు తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కిన అధికారి
- సహకరించిన ప్రైవేటు డ్రైవర్ సైతం అదుపులోకి..
- మానుకోట జిల్లా పెద్దవంగరలో ఘటన

02



## 5న నర్సంపేటకు సీఎం

సభ కోసం స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే దొంతి

05





## జనవరి 1న సాయుధ పోరాటాన్ని విరమిస్తాం

- ఒక్కొక్కరుగా కాకుండా అందరం లొంగిపోతాం
- ఆయుధాలు సైతం అప్పగిస్తాం
- అప్పటివరకు ఎన్‌కౌంటర్లు వద్దు
- మావోయిస్టు పార్టీ ఎంఎంసీ ప్రతినిధి అనంత్ లేఖ

02

# బుజ్జగింపులు


## పొలిటికల్ పార్టీలకు ఎన్నికల సెగ

- రేపటితో మొదటి విడత నామినేషన్ల దాఖలు ఆఖరు
- అభ్యర్థులను ఎంపిక చేసే పనిలో పార్టీల నేతలు బిజీ బిజీ
- కొన్ని జనరల్ స్థానాల్లో బీసీ అభ్యర్థులను నిలిపేందుకు కాంగ్రెస్ కసరత్తు
- రంగంలోకి ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్యనేతలు
- అంగీకరించని కొందరు ఆశావహులు.. వారిని బుజ్జగించేందుకు నానాతంటాలు
- నేటి రాత్రితో ఎంపిక పూర్తి చేస్తేనే రేపు నామినేషన్లు

ఇది చలికాలమైనప్పటికీ గ్రామాల్లో మొదటి విడత పంచాయతీ ఎన్నికలు సెగ పుట్టిస్తు న్నాయి. ఈ విడతలో భూపాలపల్లి జిల్లా పరిధిలోని నాలుగు మండలాలు, హనుమకొండ జిల్లాలోని మూడు మండలాలు, జనగామ జిల్లాలోని ఐదు మండలాలు, మహబూబాబాద్ జిల్లాలోని ఐదు మండలాలు, ములుగు జిల్లాలోని మూడు మండలాలు, వరంగల్ జిల్లాలోని మూడు మండలాల్లో ఎన్నికలు జరుగనున్నాయి. నామినే షన్ల దాఖలుకు శనివారం ఆఖరు కావడంతో గెలుపు గుర్రాల వేటలో ప్రధాన పార్టీలు కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు బిజీ బిజీగా ఉన్నారు. బీజేపీకి పట్టు ఉన్న చోట్ల ఆ పార్టీ కూడా పాగా వేసింది. నోటిఫి కేషన్ 26న విడుదల కాగా.. ఈ రెండు రోజులు అభ్యర్థులు నామినేషన్‌కు కావాల్సిన పత్రాలు సమకూర్చుకునే పనిలో ఉండిపోయారు. కొందరు పెండింగ్‌లో ఉన్న ఇంటి పన్నులు, ఇతర బిల్లులు కట్టే పనిలో బిజీగా గడిపారు. నామి నేషన్ దాఖలుకు ఇంకా ఒక్కరోజే ఉండడటంతో ఎలాగైనా చివరి రోజు సాయంత్రం 5 గంటల కల్లా నామి నేషన్లు సమర్పించేందుకు సిద్ధమవు తున్నారు.

-అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి

02





నోటిఫికేషన్ వచ్చేంత వరకు

## ఏం చేశారు?

పంచాయతీ ఎన్నికలపై స్టే విధించేందుకు హైకోర్టు నిరాకరణ

02



## కేసీఆర్ 'దీక్షా దివాస్' ఒక నాటకం

- తెలంగాణ వచ్చింది సోనియా గాంధీ వల్లనే
- పదేళ్లపాటు అధికారంలో ఉండి కేసీఆర్ కుటుంబం దోచుకుంది
- అధికారం కోల్పోయిన తర్వాత ఇప్పుడు మళ్లీ సెంటిమెంట్ రుద్దుతున్నది
- టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు

02



అక్రిడిటేషన్ల కోసం

## మహా ధర్నా

డిసెంబర్ 3న టీయూడబ్ల్యూజే ఉద్యమం

- హైదరాబాద్ రాష్ట్ర సమాచారశాఖ కార్యాలయం ఎదుట నిరసన
- భారీగా సంఘం నేతలు తరలిరావాలి
- జర్నలిస్టుల హక్కుల సాధనకు ఉద్యమించాలి
- టీయూడబ్ల్యూజే రాష్ట్ర రాష్ట్ర అధ్యక్షుడు కే విరాహత్ అలీ

02

JOURNALISTS' UNION OF INDIA Estd. 2023

# నోటిఫికేషన్ వచ్చేంత వరకు ఏం చేశారు?

- పంచాయతీ ఎన్నికలపై స్టే విధించేందుకు హైకోర్టు నిరాకరణ



అక్షరదర్బార్, హైదరాబాద్: రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలపై స్టే విధించేందుకు హైకోర్టు నిరాకరించింది. రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లపై ప్రభుత్వం జారీ చేసిన జీవో 46పై అభ్యంతరంపై వ్యక్తం చేస్తూ గురువారం కొన్ని బీసీ సంఘాల నేతలు హైకోర్టును ఆశ్రయించాయి. బీసీలకు ఏబీసీడీ వర్గాల వారీగా రిజర్వేషన్లు ఇప్పించేలా ఎన్నికల సంఘానికి ఆదేశాలివ్వాలని పిటిషన్లో పేర్కొన్నాయి. శుక్రవారం ధర్మాసనం విచారణ చేపట్టి ఇప్పటికే ఎన్నికల ప్రక్రియ మొదలైనందున ఈ దశలో స్టే విధించలేమని తేల్చి చెప్పింది. నోటిఫికేషన్ విడుదలయ్యాక ఎందుకు సవాల్ చేస్తున్నారని ప్రశ్నించింది. అంతకముందు వరకు ఏం చేశారని మందలించింది. కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను ఎనిమిది వారాలకు వాయిదా వేసింది.

# బహుజనులు రాజ్యాధికారంలోకి రావాలి

**బీసీ హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింది కుమారస్వామి**

అక్షర దర్బార్, నల్లబెల్లి: అగ్రవర్ణ ఆధిపత్య దోపిడిని అంతం చేసి జ్యోతిరావు పూలే ఆశయాలను సాధించాలంటే ఎస్సీ, ఎస్టీ, బీసీలు రాజ్యాధికారంలోకి రావాలని బీసీ హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింది కుమారస్వామి అన్నారు. నల్లబెల్లి గ్రామ పంచాయతీ ఆవరణలో పూలే చిత్రపటానికి నివాళులు అర్పించిన అనంతరం ఆయన మాట్లాడారు. శూద్రుల హక్కుల కోసం పూలే దంపతులు చేసిన పోరాటాన్ని గుర్తుచేస్తూ, అగ్రవర్ణ ఆధిపత్య పార్టీల రాజకీయాలు నేటికీ బహుజన వర్గాలను విద్య, వైద్యం, ఉపాధి అవకాశాల నుంచి దూరం చేస్తున్నాయని విమర్శించారు. రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకంగా ప్రైవేటీకరణను ప్రోత్సహిస్తున్న పాలకుల స్థానంలో బహుజనులు అధికారంలోకి వచ్చినప్పుడే పూలే ఆశయాలు నిజమవుతాయని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పరికి కోర్నేలు, బొట్ల ప్రతాప్, నాగెల్లి ప్రకాష్, సీపీఐ మండల కార్యదర్శి కడియాల క్రాంతి కుమార్, కన్నం ఎల్లయ్య, కాంగ్రెస్ నాయకులు కొండి అశోక్, పాడేటి కిషోర్ సామేల్ తదితరులు పాల్గొన్నారు



# కేసీఆర్ 'దీక్షా దివాస్' ఒక నాటకం

- తెలంగాణ వచ్చింది సోనియా గాంధీ వల్లనే
- పదేళ్ల పాటు అధికారంలో ఉండి కేసీఆర్ కుటుంబం దోచుకుంది
- అధికారం కోల్పోయిన తర్వాత ఇప్పుడు మళ్లీ సెంటిమెంట్ రుద్దుతున్నది
- టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు



అక్షరదర్బార్, హైదరాబాద్ : తెలంగాణ సాధన కోసం బీఆర్ఎస్ అధినేత నాడు చేసిన దీక్షా దివాస్ ఒక నాటకమని, నిజానికి ఏఐసీసీ అధినేత్రి సోనియా గాంధీ ఇవ్వడం వల్లే స్వరాష్ట్రం వచ్చిందని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ ఎస్ నేతలు దీక్షా దివాస్ చేపట్టిన సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఉద్యమ సమయంలో కేసీఆర్ దీక్ష మూడు రోజుల్లోనే విరమించి పలాయనం చిత్తగించారని ఎద్దేవా చేశారు. ఉద్యమ సెంటిమెంట్‌ను వాడుకుని రాజకీయ ప్రయోజనం పొందిన కేసీఆర్, ఇప్పుడు అధికారం కోల్పోవడంతో తమ ఉనికిని కాపాడుకోవడానికి మళ్లీ సెంటిమెంట్‌ను రాజేసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. సోనియా గాంధీ కరుణించకపోతే తెలంగాణ వచ్చేది కాదని, కేసీఆర్ ముఖ్యమంత్రి కూడా అయ్యేవారే కాదని పేర్కొన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన దీక్షతో కేసీఆర్ దీక్షకు అసలు ఏమాత్రం పొంతన లేదని తేల్చి చెప్పారు. ఉద్యమంలో పాల్గొని ఆత్మార్పణం చేసుకున్నది పేదలు, విద్యార్థులు, ఎస్సీలు, ఎస్టీలేనని, వారి త్యాగాల వల్లే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని మహేష్ గౌడ్ ఉద్ఘాటించారు. ఉద్యమంలో ఎవరి బిడ్డలు చనిపోయారో అందరికీ తెలుసని, మరి కేసీఆర్ కుటుంబంలో, బంధువుల్లో ఎవరైనా చనిపోయారా అని ఆయన ప్రశ్నించారు. పదేళ్లపాటు కేసీఆర్ కుటుంబం రాష్ట్రాన్ని పూర్తిగా దోచుకుందని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. బీఆర్ఎస్ ఇప్పుడు సెంటిమెంట్‌ను రెచ్చగొట్టడం మానుకుని, రాష్ట్రంలో తమ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు చేసిన అవినీతి, వైఫల్యాలపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.




# వారసత్వ భూబదిలీకి లంచం డిమాండ్

- రైతును రూ.15 వేలు అడిగిన తహసీల్దారు
- నగదు తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కిన అధికారి
- సహకరించిన ప్రైవేటు డ్రైవర్ సైతం అదుపులోకి..
- మానుకోట జిల్లా పెద్దవంగరలో ఘటన

అక్షరదర్బార్, పెద్దవంగర : వారసత్వంగా వచ్చిన భూమిని ఒక రైతు పేరుపై మార్చేందుకు లంచం అడిగి, బాధితుడి నుంచి లంచం తీసుకుంటూ మహబూబాబాద్ జిల్లా పెద్ద వంగర తహసీల్దార్ వీరగంటి మహేందర్ రెడ్‌హ్యాండెడ్‌గా అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు పట్టుబడ్డాడు. తహసీల్దార్‌తో పాటు అతనికి సహకరించిన ప్రైవేటు కారు డ్రైవర్ తిప్పని గౌతమ్‌నూ అదుపులోకి తీసుకున్నారు. మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలానికి చెందిన ధరావత్ మోహరియా నాయక్ అలియాస్ మురళి తనకు వారసత్వంగా వచ్చిన భూమిని, తన పేరుపైకి మార్చాలని ఆర్జీ పెట్టుకున్నాడు. అందుకు తహసీల్దార్ మహేందర్ రూ.15,000 వేల లంచం డిమాండ్ చేశాడు. అంత సొమ్ము ఇవ్వడానికి ఇష్టం లేని రైతు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఈ మేరకు ప్రణాళిక సిద్ధం చేసుకున్న ఏసీబీ అధికారులు శుక్రవారం మధ్యాహ్నం తహసీల్దార్ కార్యాలయంలో మాటు వేశారు. రైతు నుంచి తహసీల్దారు మహేందర్ రూ.15,000 లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితులను వరంగల్ ఎస్పీఈ అండ్ ఏసీబీ కేసుల ప్రత్యేక న్యాయమూర్తి ముందు హాజరుపరిచారు.

# జనవరి 1న సాయుధ పోరాటాన్ని విరమిస్తాం

- ఒక్కొక్కరుగా కాకుండా అందరం లొంగిపోతాం
- ఆయుధాలు సైతం అప్పగిస్తాం
- అప్పటివరకు ఎన్ కౌంటర్లు వద్దు
- మావోయిస్టు పార్టీ ఎంఎంసీ ప్రతినిధి అనంత్ లేఖ



అక్షరదర్బార్, హైదరాబాద్: జనవరి 1న సాయుధ పోరాటాన్ని విరమిస్తామని, ఒక్కొక్కరుగా కాకుండా పార్టీ సభ్యులంతా ఒకేసారి లొంగిపోతామని శుక్రవారం మావోయిస్టు పార్టీ మహారాష్ట్ర- మధ్యప్రదేశ్- ఛత్తీస్‌గఢ్ (ఎంఎంసీ) జోన్ జోన్ ప్రతినిధి అనంత్ పేరిట లేఖ విడుదలైంది. లేఖ సారాంశం.. మావోయిస్టు పార్టీ అగ్రనేతలు మల్లోజుల వేణుగోపాల్, ఆశన్న అలియాస్ తక్కెళ్లపల్లి వాసుదేవరావు లొంగుబాటుతో పాటు హిడ్మా ఎన్‌కౌంటర్ తర్వాత పార్టీ మరింత బలహీనపడింది. పార్టీలో మిగిలివారంతా లొంగిపోయేందుకు సిద్ధంగా ఉన్నారు. ఆయుధాలను సైతం అప్పగిస్తాం. ప్రభుత్వ పునరావాసాన్ని అంగీకరిస్తాం. మాకు సహకరించడానికి సిద్ధంగా ఉన్న ఏ రాష్ట్రంలోనైనా మేం లొంగిపోతాం. అందరూ లొంగిపోయే వరకు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల ప్రభుత్వాలు సంయమనం పాటించాలని, దయచేసి ఎలాంటి రక్తపాతానికి దిగొద్దు అని లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు.

# పూలేకు ఘన నివాళి



అక్షర దర్బార్, శాయంపేట: మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి పురస్కరించుకుని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూలే విద్య ద్వారా బడుగు, బలహీన వర్గాల్లో వెలుగులు నింపిన మహనీయుడని పేర్కొన్నారు. సమానత్వం, న్యాయం, విద్యా హక్కుల కోసం పూలే చేసిన కృషిని స్మరించుకుంటూ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ, బీసీ, బడుగు వర్గాల విద్యార్థులకు విస్తృత సౌకర్యాలు అందిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పోలేపల్లి శ్రీనివాసరెడ్డి, అబ్బు ప్రకాశ్ రెడ్డి, చిట్టిరెడ్డి రాజిరెడ్డి, చిందం రవి తదితరులు పాల్గొన్నారు.

# అక్రిడిటేషన్ల కోసం మహాధర్నా


- డిసెంబర్ 3న టీయూడబ్ల్యూజే ఉద్యమం
- హైదరాబాద్ రాష్ట్ర సమాచారశాఖ కార్యాలయం ఎదుట నిరసన
- భారీగా సంఘం నేతలు తరలిరావాలి
- జర్నలిస్టుల హక్కుల సాధనకు ఉద్యమించాలి
- టీయూడబ్ల్యూజే రాష్ట్ర రాష్ట్ర అధ్యక్షుడు కే విరాహత్ అలీ

అక్షరదర్బార్, హైదరాబాద్ : వర్కింగ్ జర్నలిస్టులకు 20 నెలలుగా అక్రిడిటేషన్ ఇవ్వకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తూ, ఎప్పటికప్పుడు కార్డును రెన్యువల్ చేస్తున్న ధోరణికి నిరసనగా తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే) ఉద్యమానికి పిలుపునిచ్చింది. కొత్త అక్రిడిటేషన్ కార్డుల జారీ డిమాండ్‌తో డిసెంబర్ 3వ తేదీన హైదరాబాద్ మాసాబ్ ట్యాంక్ లోని రాష్ట్ర సమాచార శాఖ కమిషనర్ కార్యాలయం వద్ద మహాధర్నా తలపెట్టింది. ఆ రోజు ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ నిరసనకు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు / రాష్ట్ర కార్యవర్గ సభ్యులు / రాష్ట్ర , జాతీయ కౌన్సిల్ సభ్యులు /వివిధ సబ్ కమిటీల సభ్యులు తప్పకుండా ధర్నాలో పాల్గొనాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కే విరాహత్ అలీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే రాంనారాయణ, ఉపాధ్యక్షులు గాడిపెల్లి మధు గౌడ్, కార్యవర్గ సభ్యులు వేణుమాధవ్, కంకణాల సంతోష్ పిలుపునిచ్చారు ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి వ్యతిరేకంగా జర్నలిస్టులంతా ఏకమై ఉద్యమించాలని విజ్ఞప్తి చేశారు. హెల్త్ కార్డులు, ఇళ్ల స్థలాల సమస్యలు ఉన్నాయని, వా టిన్నింటిని ఉద్యమం ద్వారానే పరిష్కరించుకోగలుగుతామని, కాబట్టి సంఘం సభ్యులంతా హైదరాబాద్‌కు తరలిరావాలని పిలుపునిచ్చారు.

# ఆదివాసీ మహిళలపై దాడులు సహించం

- నిందితులపై కేసులు నమోదు చేయాలి
- ఆదివాసీ జేఏసీ డిమాండ్

అక్షర దర్బార్, నూగూరు–వెంకటాపురం: అబ్బాయిగూడెం ఇసుక క్వారీలో పెసా చట్టం అమలును అడ్డుకుంటూ గిరిజనేతరులు ఆదివాసీ మహిళలపై దాడులు చేసినప్పటికీ చర్యలు తీసుకోకపోవడం పై ఆదివాసీ జేఏసీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. దాడికి గురైన మహిళలను పరామర్శించిన నాయకులు, మునీకాంతపై రాయితో బెదిరించిన వారిపై SC/ST అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించి ధర్నాలు చేసిన గిరిజనేతరులపై కేసులు పెట్టాలని, క్వారీ మహిళలకు పోలీస్ భద్రత కల్పించాలని కోరారు. నల్ల



కుంటపల్లి, ముత్రవానిగూడెం ప్రభుత్వ భూములను కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని జేఏసీ జిల్లా అధికారులను కోరింది.

## నిరుపయోగంగా ఆయుష్ కేంద్రాలు

అక్షర దర్బార్, నల్లబెల్లి: మేడేపల్లి పీహెచ్‌సీ పరిధిలోని ఆయుష్ ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది తరచూ గైర్హాజరు అవుతుండడంతో ప్రజలకు సేవలు అందకపోతోందని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డాక్టర్లు, ఫార్మసిస్ట్, ఇతర సిబ్బంది హాజరు పట్టికలో సంతకాలు చేస్తూనే కేంద్రంలో అందుబాటులో లేరని ఆరోపిస్తున్నారు. మందులు ఉన్నప్పటికీ ఫార్మసిస్ట్ లేక రోగులు చికిత్స పొందకుండా తిరిగి వెళ్లిపోవాల్సి వస్తోంది. ఆయుష్ వైద్యంపై ప్రజల్లో అవగాహన లేకపోవడం కూడా మరొక సమస్యగా నిలిచింది. పరిస్థితిని పరిశీలించి గైర్హాజరు సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



# సమస్యల స్వాగతం

- పరిష్కారం కొత్త కమిషనర్ అంజయ్యకు ఓ సవాల్
- ఈ కమిషనర్ అయినా సుదీర్ఘ కాలం ఉండేనా అని ఆసక్తికర చర్చ




అక్షరదర్బార్, పరకాల: తాజాగా పరకాల మున్సిపాలిటీలో కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన అంజయ్యకు సమస్యలు స్వాగతం పలికాయి. ఇక్కడ ముసురుకున్న సమస్యలను పరిష్కరించటం ఆయనకు సవాలే అని చెప్పవచ్చు. అయితే గత ఏడాదిలోనే ముగ్గురు కమిషనర్లు మారిన నేపథ్యంలో కొత్తగా వచ్చిన అంజయ్య ఎన్ని రోజులు పనిచేస్తారు?, సుదీర్ఘకాలం కొనసాగేనా?, ఈసారి అయినా పరిపాలనలో స్థిరత్వం వస్తుందా? అనేది ప్రస్తుతం చర్చీయాంశమైంది. ప్రజలు మాత్రం తమను వేధిస్తున్న సమస్యలకు పరిష్కారం లభించవచ్చని ఆశిస్తున్నారు.

### - ప్రజల్లో అసంతృప్తి

పరకాలలో మున్సిపాలిటీకి అవసరమైన సిబ్బంది లేకపోవడం, ఉన్న సిబ్బంది పనితీరు ఆశిస్తున్న స్థాయిలో లేకపోవడం ప్రజల్లో తీవ్ర అసంతృప్తికి దారితీసింది. పలు విభాగాల్లో ఫీల్డ్ సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో చెత్త సేకరణ, వీధి దీపాల మరమ్మతులు, డ్రైనేజ్ సమస్యల పరిష్కారంలో ఆలస్యం చోటుచేసుకుంటోంది. కొత్త కమిషనర్ ఈ పరిస్థితులను మార్చగలరా? అనే చర్చ ఇక్కడ సాగుతోంది.

### - భారీగా బకాయిలు

మున్సిపల్ కమిషనర్లు మారినా ఇంటి పన్నులు, నల్ల పన్నుల వసూళ్లలో మాత్రం పెద్దగా పురోగతి కనిపించలేదు. పట్టణంలో రూ.లక్షల బకాయిలు పేరుకుపోయాయి. అవి వసూలైతే అభివృద్ధి పనులకు ఆర్థిక ఇబ్బందులు తొలగిపోతాయని స్థానికులు భావిస్తున్నారు. కొత్త కమిషనర్ ఈ దిశగా కఠిన చర్యలు తీసుకుంటారా? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

### - కాంప్లెక్స్ కిరాయిల వసూళ్లు..

మున్సిపాలిటీ ఆధ్వర్యంలోని కాంప్లెక్స్‌ల కిరాయిలు గత కొన్నేళ్లుగా సక్రమంగా వసూలు కాకపోవడం కూడా పెద్ద సమస్యగానే ఉంది. నెలలు గడిచినా కిరాయిలు చెల్లించని దుకాణాలకు సంబంధించి ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని స్థానికులు చెబుతున్నారు. అంజయ్య కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించడంతో ఈ కిరాయిల వసూళ్లపై కఠినంగా వ్యవహరించేనా? అన్న అంశంపై ప్రజలు ఆశతో ఎదురు చూస్తున్నారు.

### - ప్రక్షాళన జరగాలని

"పదవి మాత్రమే కాదు, మొత్తం మున్సిపాలిటీ వ్యవస్థనే ప్రక్షాళన చేయాలి" అని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఉద్యోగుల బాధ్యతలు, పదవుల పునర్విభజన, క్రమశిక్షణ చర్యలు వంటి అంశాల్లో కొత్త కమిషనర్ మార్పులు చేస్తారా?, తన మార్క్ చూపిస్తారా? అనేది ఇప్పుడు టాపిక్ గా మారింది. కొత్త కమిషనర్ ముందున్న సవాళ్లు చిన్నవి కావు. పరకాల మున్సిపాలిటీ ఎదురు చూస్తున్న మార్పులు జరుగుతాయా? లేక గతంలానే విధానాలు కొనసాగుతాయా? అన్నది మున్ముందు స్పష్టమయ్యే అవకాశం ఉంది.

## బీజేపీ అభ్యర్థులను గెలిపించాలి

జన్నే మొగిలి



అక్షర దర్బార్, శాయంపేట: శాయంపేట మండల కేంద్రంలో స్థానిక సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల సన్నాహక సమావేశాన్ని బీజేపీ మండల అధ్యక్షుడు నరహరిశెట్టి రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జన్నే మొగిలి మాట్లాడుతూ, మూడవ విడత స్థానిక ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామపంచాయతీలను నిర్వీర్యం చేసి, ఎన్నికలు ఆలస్యం చేయడంతో కేంద్ర నిధులు రాక గ్రామాల అభివృద్ధి కుంటుపడిందని విమర్శించారు. ప్రజలు దీనిని గమనించి కాంగ్రెస్‌ను తగిన విధంగా నిలదీయాలని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ రాయరాకుల మొగిలి,జిల్లా ఉపాధ్యక్షురాలు కోడెపాక స్వరూప,జిల్లా కౌన్సిల్ మెంబర్ కానుగుల నాగరాజు, మండల ప్రధాన కార్యదర్శులు భూతం తిరుప, మామిడి విజయ్, సీనియర్ నాయకులు బాసని విద్యాసాగర్, వనం దేవరాజ్, గడ్డం రమేష్, మోత్కూరి సత్యనారాయణ, యువమోర్చా జిల్లా నాయకులు కొత్తపల్లి శ్రీకాంత్,బడే శివ, దళిత మోర్చా మండల అధ్యక్షుడు మంద సురేష్, మండల ఉపాధ్యక్షులు కోమటి రాజశేఖర్, మండల కార్యదర్శులు మేకల సుమన్, వంగరి శివ, కోశాధికారి కుక్కల మహేష్,ఎర్ర రాకేష్ రెడ్డి, బూత్ అధ్యక్షులు, వంగాల భాస్కర్ రెడ్డి, పున్నం సాంబయ్య, పెద్దిరెడ్డి సీతారాం రెడ్డి, ఎర్ర తిరుపతిరెడ్డి, మూడెడ్ల పైడి, మంద మధు, చెక్క దినేష్, కొంగరి సుధాకర్, మైల ప్రమోద్, కన్నెబోయిన రమేష్, తదితరులు పాల్గొన్నారు

## పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన సీఐ

అక్షర దర్బార్, టేకుమట్ల: రాబోయే గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో టేకుమట్ల మండల పరిధిలోని వివిధ పోలింగ్ స్థానాలను శుక్రవారం చిట్యాల సీఐ మల్లేష్, టేకుమట్ల ఎస్సై సుధాకర్ కలిసి విస్తృతంగా పరిశీలించారు. ఆఫీస్‌లు భద్రత, విద్యుత్, తాగునీటి, షెల్టర్, టేబుల్స్, కుర్చీలు, రాంపులు, టాయిలెట్లు వంటి సదుపాయాలపైన దృష్టి పెట్టి ఒక్కో బూత్‌ను సమగ్రంగా తనిఖీ చేశారు. సీఐ మల్లేష్ తెలిపారు——ఎన్నికలు శాంతి, భద్రతలతో జరగాలని ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాము; సమస్యాత్మక బూత్‌లకు అదనపు పట్రోలింగ్, రౌండ్లు, పికెటింగ్ ఏర్పాటు చేయబడతాయని, వృద్ధులు, మహిళలు, దివ్యాంగులకు ప్రత్యేక సౌకర్యాలు ఆవశ్యకమని అధికారులు సూచించారని చెప్పారు.



## అంబేద్కర్ ఫెలోషిప్ జాతీయ అవార్డుకు పుల్ల ప్రతాప్ ఎంపిక



అక్షర దర్బార్, చిట్యాల : చిట్యాల మండల కేంద్రానికి చెందిన పుల్ల ప్రతాప్ అంబేద్కర్ ఫెలోషిప్ నేషనల్ అవార్డ్‌కు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని కాకతీయ దళిత సాహిత్య అకాడమీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ జితేందర్ మను శుక్రవారం ప్రకటించారు. గత 15 సంవత్సరాలుగా అంబేద్కర్ ఆశయాల సాధన, కళారంగంలో గాయకుడిగా, రచయితగా సమాజంపై అనేక అంశాలలో విశేష కృషి చేస్తున్నందుకు ప్రతాప్‌ను అవార్డుకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఢిల్లీలోని పంచశీల ఆశ్రమంలో డిసెంబర్ 12న జరగనున్న 41వ జాతీయ–అంతర్జాతీయ సదస్సులో ప్రముఖుల చేతుల మీదుగా అవార్డు ప్రదానం జరుగనుంది. అవార్డుకు ఎంపికైన అనంతరం పుల్ల ప్రతాప్ మాట్లాడుతూ, తన సేవలను గుర్తించిన అకాడమీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ జితేందర్ మను కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తనకు సహకరించిన అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి పుల్ల మల్లయ్య, సీనియర్ నాయకులు దొడ్డి కిష్టయ్య, దబ్బేట రమేష్, పుల్ల ప్రేమ్ సాగర్, జన్నే యుగేందర్, బొడ్డు ప్రభాకర్, సరిగొమ్ముల రాజేందర్, గుర్రపు రాజమౌళి, గురుకుంట్ల కిరణ్, గుర్రపు రాజేందర్, కట్కూరి శ్రీనివాస్, కట్కూరి రమేష్, గుర్రపు తిరుపతికి కృతజ్ఞతలు తెలిపారు.

## పూలే 135వ వర్ధంతి

అక్షర దర్బార్, చిట్యాల : చిట్యాల మండల కేంద్రంలో అంబేద్కర్ యువజన సంఘం మండల ప్రధాన కార్యదర్శి పుల్ల ప్రతాప్ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావు పూలే 135వ వర్ధంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ప్రధాన అతిథిగా హాజరైన అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి పుల్ల మల్లయ్య మాట్లాడుతూ, కులవ్యవస్థ, అనాచారాలు, అంటరానితనం, దోపిడీ నిర్మూలన కోసం జీవితాంతం పోరాడిన మహానుభావుడు జ్యోతిరావు పూలేనని గుర్తుచేశారు. కార్యక్రమంలో సంఘం మండల మాజీ అధ్యక్షుడు సరిగమల రాజేందర్, ప్రచార కార్యదర్శి కట్కూరి రాజు, నాయకులు గురుకుంట్ల కిరణ్, పాముకొంట్ల చందర్, గడ్డం సదానందం తదితరులు పాల్గొన్నారు.



# నామినేషన్ ప్రక్రియలో జాగ్రత్త వహించాలి

- నామినేషన్ పత్రంలో ఖాళీలు ఉంచరాదు:

**జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్**

అక్షర దర్బార్, ములుగు: గ్రామ పంచాయతీ ఎన్నికల్లో నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థులు ఎలాంటి పొరపాట్లు చేయకుండా జాగ్రత్త వహించాలని, నామినేషన్ పత్రాల్లో ఖాళీలు ఎక్కడా ఉంచరాదని జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్ సూచించారు. నామినేషన్ ప్రక్రియపై ఆయన శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పలు మార్గదర్శకాలను తెలియజేశారు:

**ప్రధాన సూచనలు:**

- ఇద్దరు సాక్షులతో కూడిన సెల్ఫ్ డిక్లరేషన్ తప్పనిసరి.
- నామినేషన్ తో జత చేయకపోతే, చివరి తేదీ సాయంత్రం 5 గంటలలోపు సమర్పించాలి.
- డిక్లరేషన్ కు అఫిడవిట్, నోటరీ అవసరం లేదు.
- నామినేషన్ లోని అన్ని కాలమ్ లను పూర్తి చేయాలి.
- సమాచారం లేకుంటే "నిల్", "వర్తించదు" అని పేర్కొనాలి.
- సెల్ఫ్-డిక్లరేషన్ టైప్ చేయాలి లేదా స్పష్టంగా వ్రాయాలి.
- అభ్యర్థి పేరుతో చెల్లుబాటు అయ్యే కొత్త బ్యాంక్ ఖాతా తప్పనిసరి.
- ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు కుల ధృవీకరణ పత్రం జత చేయాలి.
- సర్పంచ్, వార్డ్ మెంబర్ అభ్యర్థులు సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాలి.

నామినేషన్ ప్రక్రియను నిర్బంధంగా, తప్పులులేకుండా పూర్తి చేయాలని అన్ని అభ్యర్థులు సూచనలను పాటించాలని శ్రీధర్ సూచించారు.



## బాలాజీ విద్యార్థుల కూరగాయల మార్కెట్ సందర్శన

అక్షర దర్బార్, నర్సంపేట : బాలాజీ ఇంటిగ్రేటెడ్ టీచింగ్ స్కూల్, అక్షరధా స్కూల్ ప్రీ–ప్రైమరీ విద్యార్థులు శుక్రవారం ఫీల్డ్ ట్రిప్‌లో భాగంగా అంగడి సెంటర్‌లో ఉన్న కూరగాయల మార్కెట్‌ను సందర్శించారు. విద్యార్థులు మార్కెట్లో లభ్యమయ్యే వివిధ రకాల కూరగాయలను పరిశీలించి, వాటి ప్రయోజనాల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ, కూరగాయలు రోజువారీ ఆహారంలో తప్పనిసరిగా ఉండాలని, అవి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని తెలిపారు. కూరగాయల్లో ఫైబర్ ఎక్కువగా, కేలరీలు తక్కువగా ఉండడం వల్ల దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదం తగ్గుతుందని వివరించారు. విద్యార్థులు ప్రతి కూరగాయ ప్రత్యేకత, విక్రయ విధానం వంటి విషయాలను ఆసక్తిగా అధ్యయనం చేశారు.

## దీక్షా దివాస్ ను విజయవంతం చేయాలి

**మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి**



అక్షర దర్బార్, పరకాల: తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని స్మరించుకునేందుకు నిర్వహిస్తున్న "దీక్షా దివాస్" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి కోరారు. తెలంగాణ సాధనలో కేసీఆర్ చేసిన నిరాహార దీక్షలను గుర్తు చేసుకునేందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. దీక్షా దివాస్ కార్యక్రమం శనివారం ఉదయం 10 గంటలకు నక్కలగుట్ట కాళోజి సెంటర్ వద్ద నిర్వహించనున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎక్కువ సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## మద్యం సేవిస్తూ న్యూసెన్స్ చేసిన వ్యక్తి అరెస్ట్

అక్షర దర్బార్, టేకుమట్ల: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ న్యూసెన్స్ సృష్టించిన వ్యక్తిపై టేకుమట్ల పోలీసులు చర్యలు చేపట్టారు. రామకృష్ణాపూర్ (వి) గ్రామానికి చెందిన అల్లకొండ రమేష్ (40) ప్రజలకు అసౌకర్యం కలిగించే విధంగా ప్రవర్తించిన అతడిని వెంటనే అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. స్థానిక తహసీల్దార్ ముందు బైండోవర్ చేసి భవిష్యత్తులో ఇలాంటి చర్యలకు పాల్పడకుండా కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా చిట్యాల సీఐ మల్లేశ్ మాట్లాడుతూ, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం చట్టవిరుద్ధమని తెలిపారు.

# రెబల్ అభ్యర్థుల హవా

- పరకాలలో పంచాయతీ ఎన్నికల సందడి
- గతంలో నలుగురు సర్పంచులు ఏకగ్రీవం



అక్షరదర్బార్, పరకాల: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన గత పంచాయతీ ఎన్నికల సమయంలో పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పరకాల మండలంలో నాలుగు గ్రామ పంచాయతీల్లో ఏకగ్రీవాలకు పక్కా ప్రణాళికలు రచించి సక్సెస్ అయ్యారు. మల్లక్కపేట, అలియాబాద్, కామారెడ్డిపల్లి, హైబోత్‌పల్లి గ్రామాల్లో తమ పార్టీ మద్దతుదారులైన సర్పంచ్ అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నిక కావడంలో సఫలీకృతమయ్యారు. లక్ష్మీపురంలో మాత్రం బీఆర్ఎస్ రెబల్ అభ్యర్థి విజయంతో అందరి దృష్టిని ఆకర్షించగా, నాగారం గ్రామంలో అప్పటి ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ మద్దతుదారు సర్పంచ్ గా గెలుపొందారు. పైడిపల్లిలో సర్పంచ్ గా స్వతంత్ర అభ్యర్థి విజయం సాధించారు.

**- ప్రస్తుతం ఏకగ్రీవాలపై చర్చ**

ఈసారి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పరకాల మండలంలో ఎన్ని సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవం అవుతాయన్న చర్చ మండల వ్యాప్తంగా జోరందుకుంది. మండలంలోని మొత్తం 10 సర్పంచ్ స్థానాల్లో 5 జనరల్, 3 ఎస్సీ, 2 బీసీలకు రిజర్వ్ కాగా, ఈ మండలంలో రెండో విడతలో డిసెంబర్ 14న పంచాయతీ ఎన్నికలు జరుగుతాయని అధికారులు ప్రకటించారు.

**- రెబల్ అభ్యర్థుల గుబులు**

పరకాలలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలలో రెబల్ అభ్యర్థులే ఎక్కువగా రంగంలోకి దిగే అవకాశం ఉందనే ప్రచారం బలంగా వినిపిస్తుంది. సర్పంచ్ గా పోటీ చేసేందుకు "మద్దతు లభించకుంటే తగ్గేది లేదంటూ... రెబల్‌గానైనా పోటీ తప్పద"ని పలువురు ఆశావహులు బహిరంగంగానే అంటున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ముఖ్యంగా జనరల్ స్థానాలు, ఎస్సీ రిజర్వ్ స్థానాల్లో రెబల్స్ ప్రాబల్యం గణనీయంగా కనిపిస్తున్నదంటున్నారు.

**- పార్టీలకు తలనొప్పి**

ఆయా ప్రధాన పార్టీ నుంచి సర్పంచ్ గా బరిలోకి దిగడానికి మద్దతు ఎవరికి దక్కినా రెబల్ అభ్యర్థుల వల్ల రాజకీయ పార్టీలకు ఉపశమనం లేదని ముఖ్య నాయకులు అంగీకరిస్తున్నారు. ఏకగ్రీవం కోసం బీజేపీ నేత బండి సంజయ్ ప్రకటించిన "సర్పంచ్‌ను ఏకగ్రీవం చేస్తే రూ.10 లక్షలు నగదు" అన్న వ్యాఖ్యలు కూడా పరకాలలో చర్చనీయాంశం అవుతున్నాయి.

**- తీవ్ర పోటీకి రంగం సిద్ధం**

పరకాల మండలంలో ఈ సారి సర్పంచ్ ఎన్నికలు రసవత్తరంగా, తీవ్ర పోటీతో సాగనున్నట్లు స్థానిక నేతలు అంచనా వేస్తున్నారు. రెబల్స్ విరుచుకుపడటం, ప్రతి పార్టీలోని అసంతృప్తి, స్థానాల రిజర్వేషన్లు అన్నీ కలిసివచ్చి పరకాలలో ఎన్నికల వేడి మరింత పెరిగింది.

### రాష్ట్రోపాధ్యాయ సంఘం రాష్ట్ర అసోసియేట్

## అధ్యక్షుడిగా సాంబయ్య



అక్షర దర్బార్, పరకాల: రాష్ట్రపాధ్యాయ సంఘం తెలంగాణ రాష్ట్ర నూతన కార్యవర్గంలో సీనియర్ నాయకులు నామాని సాంబయ్యను రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా నియమించినట్లు జిల్లా అధ్యక్షులు కామగోని రాంబాబు ప్రధాన కార్యదర్శి వేమూనూరి రాంబాబు తెలిపారు. ప్రస్తుతం నామాని సాంబయ్య పరకాల మండలం నాగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గెజిటెడ్ హెచ్ఎంగా పని చేస్తున్నారు. గతంలో వీరు ఉమ్మడి వరంగల్ జిల్లాకు అధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శిగా, రాష్ట్ర కార్యవర్గంలో వివిధ హోదాల్లో పనిచేసి ఉపాధ్యాయ ఉద్యమాలలో చురుకుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నామాని సాంబయ్య మాట్లాడుతూ రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ గా తనను ఎంపిక చేసినందుకు రాష్ట్ర అధ్యక్షుడు సదానందం గౌడ్ , ప్రధాన కార్యదర్శి జుట్టు గజేందర్ , ఉమ్మడి వరంగల్ జిల్లా నాయకులు డాక్టర్ ఆట సదయ్య జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు, రాష్ట్ర అదనపు కార్యదర్శి గా ఎంపికయినా సూర రమేష్, రాష్ట్ర ఫైనాన్స్ కమిటీ మెంబర్ గణపతి, రాష్ట్ర కౌన్సిలర్లు భీమానాధుని రవి, సుధాకర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## బీజేపీతోనే గ్రామాలాభివృద్ధి

**జిల్లా ప్రధాన కార్యదర్శి డా. గోగుల రాణా ప్రతాప్ రెడ్డి**

అక్షర దర్బార్, నర్సంపేట : నల్లబెల్లి మండలం ఆసరవెల్లి గ్రామ బీఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షుడు గుండబోయిన తిరుపతి బీజేపీలో చేరారు. కార్యక్రమం బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు తడుక వినయ్ గౌడ్ అధ్యక్షతన, వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డా. గోగుల రాణా ప్రతాప్ రెడ్డి సమక్షంలో జరిగింది. ఈ సందర్భంగా రాణా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ, కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వ నిధులతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని ప్రజలు గ్రహిస్తున్నారని, అందుకే పార్టీ చేరికలు పెరుగుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ ఉపాధ్యక్షులు సింగిరెడ్డి యాదగిరి, మండల నాయకులు ఊటుకూరి చిరంజీవి గౌడ్ హుసేన్, కిషన్, సుమన్, వీరన్న, స్వామి, రాజకుమార్, నాగరాజు పాల్గొన్నారు.

## క్షమాపణలు చెప్పాలి

అక్షర దర్బార్ శాయంపేట : రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తక్షణమే నల్గొండ డీసీసీ ప్రెసిడెంట్ కైలాస్ కు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ శాయంపేట మండల కేంద్రంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శాయంపేట మండల తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం అధ్యక్షుడు వంగర సాంబయ్య మాట్లాడుతూ.. నాటి నుండి నేటి వరకు అగ్రకుల అహంకారంతో బీసీ పద్మశాలీలను అనుగ్ తొక్కుతున్నారని తాతలు ముత్తాతలు చేసిన సేవను గుర్తించి డిసిసి అధ్యక్ష పదవి కైలాస్ ను వరించిందని అన్నారు.భవిష్యత్తులో రాష్ట్రవ్యాప్తంగా అగ్రకుల అహంకార రెడ్లు ఎక్కడ నుండి ప్రజాప్రతినిధులుగా పోటీ చేసిన ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల



నాయకులు వనం దేవరాజు, చిందం రవి, దిడ్డి ప్రభాకర్, బూర లక్ష్మీనారాయణ, రంగు ఐలుమల్లు,భాసని విద్యాసాగర్, వాలుపదాసు చంద్రమౌళి, తుమ్మ ప్రభాకర్, గొట్టిముక్కల రమేష్, దిండిగాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## సంగం డైరీ ఉత్పత్తుల సెంటర్ ప్రారంభం

అక్షర దర్బార్, పరకాల: నడికూడ మండల కేంద్రంలో సంగం డైరీ ఉత్పత్తుల సెంటర్‌ను ఆరె సంఘం మండల అధ్యక్షుడు లోకటి నగేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధులు మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలో అగ్రగామి అయిన సంగం డైరీ గత 48 ఏళ్లుగా నాణ్యతకు ప్రాధాన్యం ఇస్తూ ఉత్తమ పాల ఉత్పత్తులను అందిస్తున్నట్టు తెలిపారు. త్వరలో వరంగల్ జిల్లాలో మరిన్ని డైరీ సెంటర్లు ఏర్పాటు చేసే దిశగా ప్రణాళికలు ఉన్నాయని పేర్కొన్నారు.సెంటర్ నిర్వాహకుడు కుమార్ మాట్లాడుతూ పాలు, పెరుగు, నెయ్యి,



లస్సీ, బట్టర్ మిల్క్, ఫ్లేవర్ మిల్క్, మిల్క్ షేక్స్, లడ్డూలు, బర్ఫీలు, కుకీలు, స్నాక్స్ తదితర అనేక ఉత్పత్తులు ఇక్కడ అందుబాటులో ఉండడంతో పాటు బయట మార్కెట్‌తో పోలిస్తే తక్కువ ధరలకు లభిస్తాయని తెలిపారు. స్వచ్ఛమైన డైరీ ఉత్పత్తులతో ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు.

# నామినేషన్ల కేంద్రానికి కలెక్టర్





అక్షరదర్బార్, వరంగల్: సంగెం మండలం పల్లారుగూడ ప్రాథమికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ డా సత్య శారద శుక్రవారం పరిశీలించారు. నామినేషన్ ప్రక్రియను మరింత పారదర్శకంగా, సక్రమంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు, భద్రతా చర్యలు, సిబ్బంది సమన్వయం, ప్రజా సౌకర్యాల మెరుగుదలపై కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ పాఠశాల విద్యార్థులతో కూడా ముచ్చటించారు. విద్యార్థులు తమ లక్ష్యాలను సాధించడానికి ఇష్టపడి చదవాలని, ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ప్రోత్సాహించారు. క్రమశిక్షణ, కష్టపడి చదివే ధోరణి, విజ్ఞానపరమైన ఆసక్తి ప్రతి విద్యార్థిని ముందుకు తీసుకెళ్తాయని ఆమె అన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికలను శాంతియుతంగా, న్యాయంగా, సమర్థంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందని కలెక్టర్ తెలిపారు. అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జెడ్పి సీఈఓ రామిరెడ్డి, తహసీల్దార్ రాజ్ కుమార్, ఎంపిడిఓ తదితరులు పాల్గొన్నారు.



# 5న నర్సంపేటకు సీఎం రేవంత్ రాక

**- సభ కోసం స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే దొంతి**

అక్షరదర్బార్, వరంగల్ : డిసెంబరు ఒకటి నుంచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లాల పర్యటన ఖరారైంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన దృష్ట్యా జిల్లాల పర్యటనకు సీఎం నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైనందున డిసెంబర్ 1 నుంచి 9వ తేదీ వరకు పట్టణాల్లో జరిగేలా సీఎం పర్యటన ఖరారైనట్లు సమాచారం. డిసెంబర్ 1న మక్తల్, 2న కొత్తగూడెం, 3న సిద్దిపేట జిల్లా హుస్నాబాద్, 4న ఆదిలాబాద్, 5న వరంగల్ జిల్లా నర్సంపేటలో సీఎం పర్యటిస్తారని తెలిసింది. ఈ నేపథ్యంలో నర్సంపేట పట్టణంలోని పాకాల రోడ్డులో ఉన్న మెడికల్ కాలేజీ ఆవరణలోని స్థలాన్ని సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభ కోసం స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి శుక్రవారం పరిశీలించారు. మరో రెండు స్థలాలను కూడా పరిశీలించారు. ఆయన వెంట ఏసీపీ రవీందర్ రెడ్డి, ఆర్డీఓ ఉమారాణి, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.



సభా స్థలాన్ని పరిశీలిస్తున్న నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



## రేపు నగరానికి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

అక్షరదర్బార్, హనుమకొండ: కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి కిషన్ రెడ్డి ఈనెల 29న వరంగల్ నగరానికి రానున్నారు. వందే భారత్ రైలు ద్వారా ఆయన ఉదయం ఆరున్నర గంటలకు వరంగల్ నగరానికి చేరుకుంటారు. వరంగల్ రైల్వే స్టేషన్ ఆధునీకీకరణ పనులను పరిశీలిస్తారు. అనంతరం భద్రకాళి అమ్మవారిని దర్శించుకుంటారు ఎనిమిది గంటలకు వేయి స్తంభాల గుడి పునర్నిర్మాణ పనులు, మండపం పనులను పరిశీలిస్తారు. ఉదయం 11.45 గంటలకు కాజీపేట సమీపంలోని అయోధ్యపురం చేరుకుంటారు. ఇక్కడ నిర్మాణంలో ఉన్న రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ పనులను పరిశీలిస్తారు. ఇక్కడ సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాత్సవ ఆయన వెంట ఉంటారు. మధ్యాహ్నం ఒంటి గంటకు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని కేంద్ర ప్రభుత్వ సంస్థలకు సంబంధించిన వివిధ అభివృద్ధి పనులపై కిషన్ రెడ్డి సమీక్షిస్తారు. సాయంత్రం నాలుగు గంటలకు హంటర్ రోడ్ లోని హరిత ప్లాజాలో మీడియాతో మాట్లాడుతారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పర్యటనను పురస్కరించుకొని అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేపట్టింది.

# రేపు చివరి రోజు

**- రెండో రోజు దాఖలైన నామినేషన్లు**

అక్షరదర్బార్, హనుమకొండ: పంచాయతీ ఎన్నికల తొలి విడత నామినేషన్ల స్వీకరణ గడువు శనివారం ముగిసిపోనుంది. ఈ నేపథ్యంలో చివరి రోజు అభ్యర్థులు తమ నామినేషన్ దాఖలు చేయడానికి అభ్యర్థులు రెడీ అయ్యారు. డిసెంబర్ 11, 14, 17 తేదీల్లో మూడో విడుతల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా తొలి విడత ఎన్నికలు జరిగే గ్రామ పంచాయతీల్లో గురువారం నుంచి నామినేషన్ల స్వీకరణ మొదలైంది. గురువారం, శుక్రవారం సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు అభ్యర్థులు పలువురు నామినేషన్లు దాఖలు చేశారు. చివరి రోజు కావడంతో శనివారం పెద్ద సంఖ్యలో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు నామినేషన్లు దాఖలు అయ్యే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. రెండో రోజైన శుక్రవారం హనుమకొండ జిల్లాలోని మూడు మండలాల్లో మొదటి విడతలో ఎన్నికలు జరిగే 69 గ్రామ పంచాయతీల్లో 84 సర్పంచ్ స్థానాలకు 84 నామినేషన్లు, 658 వార్డు స్థానాల్లో 230 నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. ఇప్పటివరకు ఈ జిల్లాలోని భీమదేవరపల్లి, ఎలుకతుర్తి, కమలాపురం మండలాల్లో సర్పంచ్ స్థానాలకు 170, వార్డు సభ్యుల స్థానాలకు 291 నామినేషన్లు దాఖలైనట్లు అధికారులు ప్రకటించారు. వరంగల్ జిల్లాలో మొదటి విడతలో పంచాయతీ ఎన్నికలు జరిగే రాయపర్తి, వర్ధన్నపేట, పర్వతగిరి మండలాల్లోని 91 గ్రామపంచాయతీల్లో రెండో రోజు శుక్రవారం సర్పంచ్ స్థానాలకు 103 నామినేషన్లు, ఎనిమిది వందల వార్డు సభ్యుల స్థానాలకు గాను 165 నామినేషన్లు దాఖలైనట్లు అధికారులు ప్రకటించారు. భూపాలపల్లి జిల్లాలో తొలి విడత పంచాయతీ ఎన్నికలు జరిగే గణపురం, గోరికొత్తపల్లి, రేగొండ, మొగుళ్లపల్లి మండలాల్లోని 82 గ్రామపంచాయతీల్లో సర్పంచ్ స్థానాలకు రెండో రోజు శుక్రవారం 45 నామినేషన్లు, వార్డు స్థానాలకు 113 నామినేషన్లు దాఖలు అయినట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. అధికారులు నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు.



## పదిమంది రౌడీషీటర్ల బైండోవర్

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి: మొగుళ్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని పదిమంది రౌడీషీటర్లను స్థానిక తహసిల్దార్ ముందు బైండ్ ఓవర్ చేసినట్లు మొగుళ్లపల్లి ఎస్సై బొరగాల అశోక్ విలేకరులకు తెలిపారు స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మొగుళ్లపల్లి మండల పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండ ముందస్తు చర్యలో భాగంగా రౌడీ షీటర్ లను బైండ్ ఓవర్ చేసినట్లు ఎస్సై తెలిపారు,

## నామినేషన్లు వేసిన 'నరహరి బ్రదర్స్'

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి: మొగుళ్లపల్లి మండలం మొట్ల పల్లి క్లస్టర్లో సర్పంచ్ పదవి కోసం మొట్లపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ నరహరి పద్మ వెంకట్ రెడ్డి. మాజీ పిఎసిఎస్ చైర్మన్ నరహరి బక్కి రెడ్డి లు నామినేషన్ వేశారు టీఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థిగా వెంకట్ రెడ్డి పోటీ పడుతుండగా అధికార కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నరహరి బక్కి రెడ్డి పోటీ పడుతున్నారు మొగుళ్లపల్లి మండల పరిధిలోని మొట్లపల్లి సర్పంచి ఎన్నిక ఆసక్తికరంగా పోటీ జరగనుందని పరిశీలకులు భావిస్తున్నారు

## గొల్ల బుద్దారంలో ఉచిత వైద్య శిబిరం

అక్షర దర్బార్, భూపాలపల్లి: జయశంకర్ భూపాలపల్లి జిల్లా గొల్ల బుద్దారం గ్రామంలో శ్రీ వెంకటేశ్వర హాస్పిటల్ డా. షేక్ మహమ్మద్ యాసిన్ ఆధ్వర్యంలో ఉచిత చర్మ వ్యాధుల వైద్య శిబిరం నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థిస్తున్న సుమారు 300 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు, ఉచిత మందులు అందజేయబడ్డాయి. ప్రధానోపాధ్యాయులు మండల రవీందర్ రెడ్డి తెలిపారు, తడి దుస్తులు వాడడం, పరిశుభ్రత లోపం వంటి కారణాలతో చర్మ సమస్యలు కలిగిన పిల్లలకు ఈ శిబిరం పెద్ద సహాయం అని. ఈ కార్యక్రమంలో RMP వైద్యులు డాక్టర్ శ్రావణ్, డాక్టర్ అశోక్ రెడ్డి, 280 మంది విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పురుగుల మందు తాగి వృద్ధుడు మృతి

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి: పురుగుల మందు సేవించి వృద్ధుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం రంగాపురం లో చోటు చేసుకుంది మొగుళ్లపల్లి ఎస్సై బి అశోక్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని రంగాపురం గ్రామానికి చెందిన శ్రీ రామ్ రాజీరు (65) అనే వృద్ధుడు గత నాలుగు సంవత్సరాల క్రితం మృతుడి భార్య మృతిచెందగా ఒంటరిగా జీవిస్తు మానసికంగా బాధపడుతూ శుక్రవారం ఇంట్లో ఎవరు లేని సమయాన ఉదయం 8:00 కు పురుగుల మందు సేవించి కిందపడిపోవడంతో ఇంట్లో బంధువులు చూసి పరకాల ఆసుపత్రికి తరలించే క్రమంలో మృతి చెందినట్లు మృతుడి కుమారుడు శ్రీరామ్ రఘుపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు మొగుళ్లపల్లి ఎస్సై బి అశోక్ విలేకరులకు తెలిపారు,




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.
వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

# మీ నమ్మకమే మా బలం!

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI N0.TELTEL/2022/81915